

సాక్షి
బాపట్ల
ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



45.61 టీఎంసీలు నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 29,928 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టులో 45.61 టీఎంసీలు నిల్వ ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 7713 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు కెనాల్‌కు 750 క్యూసెక్కులు వదిలారు.

లక్ష్మీనరసింహునికి పూజలు



బెల్లంకొండ: మండలంలోని కేతవరంలో ఉన్న రాజ్యలక్ష్మీ సమేత వజ్ర లక్ష్మీనరసింహుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

అంచనాలో వంచన

- అన్నదాతను ముంచిన సర్కార్
- వరి, వాణిజ్యపంటల నష్టం తగ్గింపు
- ఎక్కువ నష్టం జరిగినా తక్కువ విస్తీర్ణం నమోదు
- పచ్చచొక్కాల నేతలు చెప్పిన పేర్లు నమోదు
- ఆందోళనలో అన్నదాతలు

కృష్ణా వరద రైతుల ఇళ్లు, పంటల్ని నీట ముంచింది. కోలుకోలేని నష్టాన్ని మిగిల్చింది. ఆదుకోవాల్సిన సర్కార్ నాటకాలు ఆడుతోంది. పంట నష్టం అంచనాలలో వంచనకు పాల్పడుతోంది. రైతులకు వరదల వల్ల కొండంత నష్టం వాటిల్లితే గోరంతగా చూపుతోంది. ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు దెబ్బతిన్న పంటల వివరాలను మొక్కుబడిగా నమోదు చేసి చేతులు దులుపుకుంటోంది. వరద నీరు పంటలను ముంచెత్తిన సమయంలో అధికారులు ఇచ్చిన ప్రాథమిక అంచనాలకు, తాజాగా ఇచ్చిన తుది జాబితాకు ఉన్న భారీ వ్యత్యాసం చూస్తే ప్రభుత్వ మోసం అర్థమవుతుంది.



ఈపూరు-కొల్లూరు పొలిమేర డొంకలో వరదకు నష్టపోయిన అరటి మొక్కలను తొలగించే పనిలో రైతులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కృష్ణా వరద వేమూరు, రేపల్లె నియోజకవర్గాలతో పాటు బాపట్ల నియోజకవర్గాల పంట పొలాల్ని ముంచెత్తింది. వేలాది ఎకరాలు నీట మునిగాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రధానంగా కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె ప్రాంతాల్లో 24 గ్రామాలు నీట మునిగాయి. 40,150 మంది రైతులకు నష్టం వాటిల్లింది. వ్యవసాయ పంటలతోపాటు వేల ఎకరాల వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా 86 వేల ఎకరాల్లో వరి నీట మునిగిందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఒక్క వరి వల్లే సుమారు రూ. 450 కోట్ల మేర నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి కూడా నివేదించారు.

నివేదికల్లో తేడాలు

- ప్రాథమికంగా వేసిన అంచనా: 96 వేల ఎకరాలు
- పంటలకు నష్టం: రూ. 579 కోట్లు
- తుది అంచనా: 44,176 ఎకరాలు
- పంటలకు నష్టం: రూ. 43.59 కోట్లు

నష్టం అంచనాలో ప్రాథమిక నివేదికకు ప్రస్తుత నివేదికకు భారీ వ్యత్యాసం కన్పిస్తోంది. ఇన్‌పుట్ సబ్సిడీ ఆర్థిక భారాన్ని తగ్గించాలన్న ప్రభుత్వం ఒత్తిడి మేరకు అధికారులు పంట నష్టం అంచనాలలో కోత పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తంగా 96 వేల ఎకరాల్లో వ్యవసాయ, వాణిజ్య పంటలు దెబ్బతినడంతో రూ. 579 కోట్లు నష్టం వాటిల్లిందని తొలుత చెప్పిన అధికారులు తీరా చూస్తే రెండు పంటలు కలిపి 44,176 ఎకరాల్లో మాత్రమే దెబ్బతిన్నాయని, దీనికి సంబంధించి రూ. 43.59 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తే సరిపోతుందని తేల్చారు. దీనిని బట్టి చూస్తే ప్రాథమిక నివేదికకు తుది నివేదికకు పొంతన లేకుండా పోయింది. వరదలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు మొక్కుబడిగా కూడా సాయమందే పరిస్థితి లేకుండా పోయింది. ఇదే జరిగితే వరదల్లో నష్టపోయిన రైతులకు తీరని అన్యాయం జరిగినట్లే.

గత ప్రభుత్వంలో ఇలా..

గత ప్రభుత్వంలో అధికారులు రైతు భరోసా కేంద్రాల నుంచి నేరుగా దెబ్బతిన్న పంట పొలాలను సందర్శించారు. రాజకీయాలు , నేతల ప్రమేయం లేకుండా పంటల వివరాలు నమోదు చేసేవారు. ఆ తర్వాత జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచేవారు. పొరపాటున ఏ ఒక్క రైతు పంట నమోదు కాకపోయినా తిరిగి నమోదు చేసేవారు. దీంతో పంటలు నష్టపోయిన ఒక్క రైతుకు అన్యాయం జరిగేదికాదు. ప్రస్తుత కూటమి పాలనలో అంతా తారుమారైంది.

నమోదులోనూ అవకతవకలు

ఇప్పుడు పచ్చపార్టీ నేతల ఆమోదంతోనే చాలా చోట్ల పంట నష్టం అంచనాలను అధికారులు నమోదు చేసినట్లు ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల ప్రతిపక్ష పార్టీ మద్దతుదారుల పంటల వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయలేదని తెలుస్తోంది. దీంతో పాటు కొన్ని మండలాలలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు నీట మునగగా కొంతమేర పొలంమాత్రమే అధికారులు నమోదు చేసి చేతులు దులుపుకున్నట్లు తెలుస్తోంది. దీంతో వరదల వల్ల పంటలు నీటమునిగినా రైతులకు సక్రమంగా పరిహారం అందే పరిస్థితి లేకుండా పోయింది. అధికారులు సక్రమంగా నష్టం వివరాలు నమోదు చేయక పోవడం వల్లే ప్రాథమిక అంచనాలకు తుది అంచనాలకు భారీ తేడా కనిపిస్తోంది.

కాకి లెక్కలు ఇలా..

- జిల్లాలో 23,485 మంది రైతులకు చెందిన 34,599.75 ఎకరాల్లో మాత్రమే వరి పంట దెబ్బతినగా, రూ. 34,59,97,500 ఇన్‌పుట్ సబ్సిడీని ప్రతిపాదించారు.
- వరితో పాటు తొమ్మిది రైతులకు చెందిన 76.78 ఎకరాల్లో మాత్రమే ఒరిగె, మొక్కజొన్న, కంది, మినుము పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. నామమాత్రంగా రూ. 50 వేల ఇన్‌పుట్ సబ్సిడీని ప్రతిపాదించారు.
- గతంలో 11,537.25 ఎకరాల్లో వాణిజ్య పంటలు దెబ్బతినగా రూ. 129.42 కోట్ల మేర నష్టం జరిగిందని ప్రభుత్వానికి ఇచ్చిన ప్రాథమిక నివేదికలో అధికారులు పేర్కొన్నారు. ఇప్పుడేమో 9,500 ఎకరాల్లో మాత్రమే వాణిజ్య పంటలు పాడయ్యాయని, రూ. 9 కోట్ల మేర మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాల్సి ఉంటుందని తేల్చారు.

అక్రమాలకు మద్దతు పలికితే వేటు

జిల్లా కలెక్టర్ వెంకటరమణ



సాక్షి ప్రతినిధి, బాపట్ల: అక్రమాలకు మద్దతు పలికే అధికారులు, సిబ్బందిపై వేటు తప్పదని జిల్లా కలెక్టర్ జె. వెంకటరమణ హెచ్చరించారు. ఇటీవల జిల్లాలో జరిగిన పలు అక్రమాలు, అవినీతికి సంబంధించి బాధ్యులైన పలువురు అధికారులను సస్పెండ్ చేసిన ఆయన, అక్రమాలకు ఎవరు మద్దతు పలికినా సహించేది లేదని తెలిపారు. కలెక్టర్ శనివారం సాక్షితో మాట్లాడారు. అవినీతి ఆరోపణలు రావడంతో చీరాల ఉపఖజానాధికారి కె.భాగ్యలక్ష్మిని సరెండర్ చేయడంతోపాటు మిగిలిన అధికారులందరిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశామని చెప్పారు. పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నగరం ఎంపీడీవో, డ్వామా పీడీ, మార్టూరులో ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి అక్కడి ఎంపీడీవోతో పాటు నలుగురు సచివాలయ ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎక్కడ అక్రమాలు జరిగినా గ్రామస్థాయిలో బాధ్యులైన అధికారులకు మొదటి తప్పుకింద చార్జ్ మెమో జారీ చేస్తామని తెలిపారు. అదే ప్రాంతంలో రెండోసారి తప్పు జరిగితే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అక్రమాలు జరగకుండా చూసుకోవాల్సి బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో తప్పు జరిగితే పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఎస్‌ఆర్‌పి, మహిళా పోలీసు బాధ్యత వహించాలన్నారు. మండల స్థాయిలో అవినీతి, అక్రమాలు జరిగితే తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్‌హెచ్‌వో బాధ్యులు అవుతారన్నారు. డివిజన్ స్థాయిలో అక్రమాలు జరిగితే ఆర్డీవో, డీఎస్పీ, డీఎల్‌డీవోలు బాధ్యత వహించాలని తెలిపారు. ఇప్పటివరకూ గ్రామ, మండల స్థాయి అధికారులకే చార్జ్ మెమోలు ఇచ్చి సస్పెండ్ చేశామని అక్రమాలు ఆగకపోతే ఇక నుంచి ఆర్డీవో, డీఎస్పీలకు సైతం ఇస్తామని చెప్పారు. ఇసుక, బుసక, గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తే చూస్తూ ఊరుకునేది లేదని తెలిపారు. భూమి, స్థల ఆక్రమణలను సహించమని, వీటికి పాల్పడే వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

న్యూస్‌రీల్

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి పూజ

రూ.2.80 కోట్ల వ్యయంతో నిర్మాణం



యద్దనపూడి: మండలంలోని గన్నవరం-యనమదల దండు దారి సమీపంలో రూ.2.80 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ వెంకట మురళి, స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు నివారించి రైతులకు, గృహ అవసరాలకు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే మార్టూరు, యద్దనపూడి మండలాల్లోని 10 గ్రామాలకు పైగా లోవోల్టేజీ సమస్య తీరుతుందని చెప్పారు. అనంతరం యనమదలలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవీంద్రబాబు, విద్యుత్ ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ, డీఈ నల్లూరి మస్తాన్‌రావు, ఈఈ శ్రీనివాసరావు, ఏడీ సురేంద్రబాబు, ఏఈ సురేంద్రబాబు పాల్గొన్నారు.

ప్రజలు భాగస్వాములు కావాలి : కలెక్టర్

బాపట్ల: స్వర్ణాంధ్ర- 2047, విజన్ బాపట్ల కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ జె. వెంకట మురళి శనివారం ఒక ప్రకటనలో కోరారు. స్వర్ణాంధ్ర -2047 కరపత్రాలు, గోడపత్రాలలో ప్రచురించిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ప్రజలెవరైనా తమ అభిప్రాయాల్ని తెలియపరచవచ్చని తెలిపారు. 2047 నాటికి భారత దేశానికి స్వాతంత్రం వచ్చి నూరేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో స్వర్ణాంధ్ర వైపు అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో సుఖసంతోషాలు, సౌభాగ్యాలతో ఎదగడానికి రూపొందించే ప్రణాళికలో ప్రజలు తమ విలువైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద సిద్ధంగా ఉంచిన దరఖాస్తులు తీసుకుని లిఖితపూర్వకంగా కూడా ఇవ్వవచ్చని తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఓబులేసు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా సీ ఓబులేసును నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న కె. రాజ్యలక్ష్మిని రెవెన్యూ శాఖలో రిపోర్టు చేయాలని కొద్ది రోజుల క్రితం ఉత్తర్వులు జారీ అయిన విషయం తెలిసిందే. తాజా బదిలీల్లో భాగంగా కమిషనర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) విభాగంలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఓబులేసును గుంటూరు అదనపు కమిషనర్‌గా నియమించారు.

నేడు జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖ సిబ్బందికి కౌన్సెలింగ్

గుంటూరు వెస్ట్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉమ్మడి జిల్లాకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియకు శనివారం అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం నుంచి జెడ్పీ ఆవరణలోని ఆ శాఖ డీఐజీ కార్యాలయంలో ఈ ప్రక్రియ జరగనుంది. సుమారు 70 మంది సబ్ రిజిస్ట్రార్లు, 80 మంది సిబ్బందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. గుంటూరు, ఒంగోలు, నెల్లూరు జిల్లాల డీఐజీ స్థాయి అధికారులతో దీనికోసం కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా గుంటూరు జిల్లా డీఐజీ జి.శ్రీనివాసరావు వ్యవహరించనున్నారు. డిమాండ్ ఉన్న పోస్టులకు ప్రజాప్రతినిధుల నుంచి కొందరు ఉద్యోగులు సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నట్లు సమాచారం. అధికారులు మాత్రం తమకు అందిన మార్గదర్శకాల ప్రకారమే బదిలీలు నిర్వహిస్తామని చెబుతున్నారు.

యర్రబాలెంలో భారీ వర్షం

ఓ ఇంటిపై పడిన పిడుగు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం ఎస్సీ కాలనీలో ఓ ఇంటిపై పిడుగు పడింది. శనివారం సాయంత్రం భారీగా వర్షం కురిసింది. యర్రబాలెంలో నివాసం ఉంటున్న సాలి బంగారయ్య అనే వ్యక్తి నివాసంపై పిడుగు పడింది. బిల్డింగ్‌పై ఒక వైపు పిట్టగోడతోపాటు స్వల్పంగా శ్లాబ్ , గోడలు బీటలు వారాయి. ఇంట్లో విద్యుత్ తీగలు మొత్తం పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.60 వేల ఆస్తి నష్టం వాటిల్లిందిబాధితుడు తెలిపారు.

కొమ్మమూరు కాలువలో పెరిగిన నీటి మట్టం

- సాక్షి కథనాలతో అధికారుల్లో కదలిక
- 6.5 అడుగులకు చేరిక హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



కారంచేడు యూటీ వద్ద నీరు

సాక్షి ఎఫెక్ట్

కారంచేడు: సాగునీటికి అలమటిస్తున్న రైతులు కొమ్మమూరు కాలువలో 6.5 అడుగుల నీటిమట్టం నమోదు కావడంలో వారి ఆనందానికి అవధులు లేవు. సాక్షి దిన పత్రికలో వరుస కథనాల్ని ప్రచురించడంతో అధికారులు మేల్కొన్నారు. కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లోని కారంచేడు, చీరాల, వేటపాలెం, చినగంజాం, నాగులుప్పలపాడు మండలాలకు చెందిన సుమారు లక్ష ఎకరాల్లో అధికారిక, అనధికారిక లెక్కల ప్రకారం రైతులు వరి సాగు చేస్తారు. ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న కొమ్మమూరు కాలువ పైనే ఆధారపడుతుంటారు. దీని ద్వారా దిగువనున్న పొలాలకు సాగునీరు సక్రమంగా అందాలంటే కనీసం 6.5 అడుగుల నుంచి 7 అడుగుల నీటిమట్టం అవసరం. అయితే, గత కొన్ని రోజులుగా కొమ్మమూరు కాలువలో కారంచేడు-కుంకలమర్రు రోడ్డులోని యూటీ వద్ద నీటి మట్టం4 నుంచి 5 అడుగులు మాత్రమే నమోదయింది. దీంతో రైతులు లక్షల రూపాయలులు ఖర్చు చేసి వరి చేలకు, నాట్లు వేసుకోవడానికి ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని పంపింగ్ చేసుకుంటున్నారు. అందుకు రైతులు ఒక్కో ఎకరానికి కనీసం రూ. 2500 నుంచి రూ. 3000 వరకు అదనపు ఖర్చు చేయాల్సి వస్తోంది. విషయాన్ని గమనించిన సాక్షి ' రైతుల ఆశలకు బీటలు' 'కన్నీటి సాగు' వంటి వరుస కథనాల్ని ప్రచురించింది. దీంతో దిగివచ్చిన నీటిపారుదల శాఖాధికారులు శనివారం ఉదయం నుంచి కొమ్మమూరు కాలువలో 6.5 అడుగుల నీటిమట్టం ఉండేలా చర్యలు తీసుకున్నారు. వరుస కథనాలతో అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన సాక్షికి రైతన్నలు అభినందనలు తెలిపారు.

ఖజానా ఉద్యోగులపై వేటు

ఎస్టీవో, సూపరింటెండెంట్ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్

చీరాల టౌన్: తమకు కాసులు వచ్చే సీట్లు దక్కలేదని ఖజానా ఉద్యోగులు పెన్‌డౌన్ చేయడంతో పాటుగా బిల్లుల్ని పాస్ చేయకపోవడంతో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఖజానా ఉద్యోగుల తీరు, పెండింగ్ బిల్లులపై 'సాక్షి' విపులంగా కథనాన్ని ప్రచురించింది. దీంతో జిల్లా కలెక్టర్ వెంకట మురళి స్పందించారు. చీరాల ఎస్టీవో భాగ్యలక్ష్మిని, సూపరింటెండెంట్ సుధీరలను సస్పెండ్ చేశారు. ఇద్దరు ఉద్యోగులను నెల్లూరు జిల్లాకు, ఒకరిని గిద్దలూరు ట్రెజరీ కార్యాలయానికి, ఒకరిని కనిగిరి ఎస్టీవో కార్యాలయానికి బదిలీ చేశారు. చీరాలకు రెగ్యులర్ ఉప ఖజానా అధికారిగా నియమించే వరకు ఇన్‌చార్జిగా బాపట్ల ఎస్టీవో సుబ్బారావుకు బాధ్యతలు అప్పగించారు. అక్రమార్జనకు, కాసులకు కక్కుర్తిపడి ఉద్యోగులు బిల్లులు, కాంట్రాక్టు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులు గురిచేసిన ఖజానా ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ భరతం పట్టారని, మిగిలిన అన్ని శాఖలపై కలెక్టర్ దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

'పల్లెనిద్ర ' తో నేరాల నియంత్రణ

అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్



పల్లె నిద్ర కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ, సిబ్బంది

బాపట్ల: పల్లెనిద్రతో నేరాల్ని నియంత్రించవచ్చని అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ పేర్కొన్నారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాలు మేరకు వెదుళ్లపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని స్టువర్టుపురంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి చేపట్టారు. గ్రామ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అసాంఘిక కార్యకలాపాలు, వివాదాలు, నేరాలు, స్థానిక ఉన్న సమస్యల గురించి అడిషనల్ ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. గంజాయి, అక్రమ మద్యం రవాణా, క్రయవిక్రయాలకు పాల్పడితే నూతన చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించిన సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100, 112 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్.ఐ మౌలుద్దీన్, వెదుళ్లపల్లి ఎస్ఐ జనార్ధన్ పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీలు

అద్దంకి: పోషకాహారంతో బాలింతలు గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత తలెత్తకుండా చూడవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. పట్టణంలోని శ్రీనివాస్ ఫంక్షన్ హాలులో శనివారం మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మావతి మాట్లాడుతూ బాలింతలు గర్భిణులు, చిన్నారులు రక్తహీనత నుంచి బయట పడటానికి గానూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం , ఫోర్టిఫైడ్ రైస్, కందిపప్పు, రాగిపిండి, గుడ్లు, పాలు, ఖర్జూరాలు, బెల్లం, వేరుశనక చిక్కీలు, అటుకులు, ఆకుకూరలతో వండిన కూరలు, పప్పు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల వంటకాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాశనలు నిర్వహించారు. అద్దంకిలోని బాలికల ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య హైస్కూళ్లను పద్మావతి తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎ.కృష్ణకుమారి, మండల విద్యాశాఖ అధికారి డి.గంగాధర్, డీసీపీయూ ఎన్.వీరాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ ఎం.సత్యనారాయణ, ఆర్ఐ.శంకర్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తమిళనాడుకు తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

వడ్లమూడి నుంచి తమిళనాడుకు లారీలో 26 వేల కిలోల తరలింపు



పట్టుబడిన లారీలో రేషన్ బియ్యం

ఒంగోలు టౌన్: ఇటీవల రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. రాష్ట్రం నుంచి పక్క రాష్ట్రాలకు కూడా తరలిపోతోంది.టంగుటూరు మండలంలోని వల్లూరు సమీపంలో ఎన్‌హెచ్ 16పై విజిలెన్స్ అధికారులు శనివారం దాడి చేసి తమిళనాడుకు చెందిన లారీని పట్టుకున్నారు. అందులో తరలిస్తున్న 26వేల కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని బ్రోకెన్ రైస్‌గా మార్చి గుంటూరు జిల్లా వడ్లమూడి నుంచి తమిళనాడుకు తరలిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. వడ్లమూడిలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్ మిల్లు నుంచి తమిళనాడులోని మధురైకి రవాణా చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. లారీలోని మొత్తం 520 బ్యాగుల బియ్యం, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఈడీటీ కృష్ణ మోహన్, సీఐ రాఘవరావు తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని సింగరాయకొండ ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జికి, లారీని టంగుటూరు పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.





ఎమ్మెల్యే తరగతి గదిలో.. విద్యార్థినులు వరండాలో..!

తరగతి గదిలో టీడీపీ శాసనసభ్యుడి సమావేశం

ఆయనొక ప్రజాప్రతినిధి.. విద్యార్థులకు పాఠాలు బోధించే సమయంలో ఇబ్బందులు కలిగించకూడదనే ఇంగిత జ్ఞానం లేకుండా ఏకంగా నగరపాలక సంస్థ పాఠశాల తరగతి గదిలోనే సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థినులను బయటకు పంపించాక సచివాలయ సెక్రటరీలు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం 53వ డివిజన్ వెంగళరావునగర్ మున్సిపల్ బాలికల హైస్కూల్ వద్ద 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం బహిరంగ సభ ఏర్పాటు చేశారు. స్కూల్ కార్యకలాపాలు కొనసాగుతూ ఉండగానే ముందే పెద్ద పెద్ద మైకులు ఏర్పాటు చేసి కార్యక్రమం నిర్వహించారు. సరే అయిపోయిన తరువాత వెళ్లిపోయారా... అంటే అదీ చేయలేదు. నేరుగా పాఠశాలలోని విద్యార్థినులను బయటకు పంపించారు. తరగతి గదిలో సచివాలయ సిబ్బంది, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బయట వరండాలోనే పాఠాలు బోధించాల్సిన పరిస్థితి టీచర్లకు ఎదురైంది. – నెహ్రూనగర్

క్లుప్తంగా

వివాహితపై లైంగిక దాడికి యత్నం

బల్లికురవ: మహిళ ఇంట్లోకి చొరబడి ఓ ఆటో డ్రైవర్ లైంగిక దాడికి యత్నించిన ఘనటపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ జీ.వి. చౌదరి వివరాల మేరకు.. మండలంలోని కొణి దెనలో భర్తలేని వివాహిత నివాసం ఉంటోంది. ఈనెల 8న ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెపై అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ నన్నెషా లైంగిక దాడి యత్నం చేయబోయాడు. దీంతో బాధితురాలు అప్రమత్తమై తప్పించుకుంది. దీనిపై శనివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఔత్సాహిక వ్యాపారులకు ముగిసిన శిక్షణ



నరసరావుపేట ఈస్ట్: నూతనంగా వ్యాపారం ప్రారంభించే నిరుద్యోగ యువతకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అండగా ఉంటుందని జిల్లా అధికారి కె.సంజీవరావు స్పష్టం చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక సంస్థ సౌజన్యంతో ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఐదు రోజులుగా వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ముగింపు సమావేశంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు మాట్లాడుతూ బ్యాంకుల నుంచి రుణాలు పొందడంలో తమ వంతు సహకారం అందిస్తామన్నారు. బ్యాంకు రుణాలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ రాయితీ అంశాలను వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఎం.బాలకృష్ణరాజు, హేమాద్రి, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల పాలిట కల్పవృక్షం కౌండిన్య ఐఏఎస్ అకాడమీ

శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు



కోచింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

పెదకాకాని: అతి తక్కువ ఫీజులతో భోజన వసతి కల్పిస్తూ పోటీ పరీక్షల్లో అత్యున్నత శిక్షణ అందిస్తున్న కౌండిన్య ఐఏఎస్ అకాడమీ విద్యార్థులకు కల్పవృక్షంగా మారిందని శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల కౌండిన్య ఐఏఎస్ అకాడమీ బ్యాంకింగ్ పరీక్ష కోసం నిర్వహించిన శిక్షణలో మొదటి బ్యాచ్ విద్యార్థుల వీడ్కోలు సభకు శనివారం ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. అకాడమీ వ్యవస్థాపకులు, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ ఈవీ నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్, ఎల్ఐసీ, బ్యాంకింగ్ రంగాలలో ఉద్యోగాలకు ఉత్తమ శిక్షణ ఇవ్వడంలో కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఆదర్శనీయంగా ఉందని తెలిపారు. విద్యార్థులు నిరంతరం పట్టుదలతో ఇష్టపడి చదివి పోటీ పరీక్షలలో విజయం సాధించాలని ఆయన సూచించారు. అకాడమీ అందిస్తున్న కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఈవీ నారాయణ 20 సంవత్సరాల క్రితమే కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారన్నారు. రూ.2.25 కోట్ల మూలధనాన్ని సమకూర్చి ఇప్పటి వరకు ప్రతిభ గల పేద విద్యార్థులకు రూ.రెండు కోట్ల మేరకు ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించడం కోసం రూ.7 కోట్ల విరాళాలు సేకరించి కౌండిన్య ఐఏఎస్ అకాడమీని గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు అకుంఠిత దీక్షతో అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ ఈవీ నారాయణ ప్రసంగిస్తూ ప్రతిభ గల పేద విద్యార్థులను ఆదుకోవడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. రూ.50 లక్షలతో డాక్టర్ ఈవీ నారాయణ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, దాని ద్వారా పేద విద్యార్థులకు నైపుణ్యాలను అందించడానికి కృషి చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు రచించిన 'సివిల్ సర్వీసెస్ ప్రాథమిక అంశాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రతులను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ప్రతినిధులు వాకా రామ్‌గోపాల్ గౌడ్, చిలక చంద్రమౌళి, బెల్లంకొండ సదాశివ గౌడ్, పామర్తి సాంబశివరావు, వీరంకి రంగారావు, వేముల శేషాచలం, డాక్టర్ కృష్ణ, డాక్టర్ తాతా సాంబశివరావు, వడ్డెంగుంట సుబ్బారావు, బొబ్బిళ్ళ వెంకటేశ్వర రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తా చాటిన కృష్ణా జిల్లా గిత్తలు



పోటీల్లో బండలాగుతున్న గిత్తలు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో నందమూరి తారక రామారావు మెమోరియల్, నూతలపాటి పరమేశ్వరరావు మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న బండలాగుడు పోటీల్లో కృష్ణా జిల్లా ఎడ్లు సత్తా చాటాయి. శనివారం సబ్ జూనియర్స్ విభాగంలో గుంటూరు, కృష్ణా, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, తెలంగాణ నుంచి పది జతలు పాల్గొన్నాయి. వీటిలో కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లికి చెందిన అక్కినేని సత్యచౌదరి గిత్తలు 4,500 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా ఇంకొల్లు గ్రామానికి చెందిన నల్లూరి కృష్ణయ్య గిత్తలు 3,900 అడుగులు లాగి ద్వితీయ స్థానాన్ని, పల్నాడు జిల్లా నాదెండ్లకు చెందిన దేవభక్తుని శ్రీకాంత్ చౌదరి గిత్తలు 3757.2 అడుగులు లాగి తృతీయ స్థానం, నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రమణ్యేశ్వర రెడ్డి గిత్తలు 3631.4 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు స్థానిక శాసనసభ్యుడు బూర్ల రామాంజనేయులు నగదు బహుమతులు, మెమెంటోలు అందజేశారు.

24న రెజ్లింగ్ జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–19 రెజ్లింగ్ జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపిక ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫెడరేషన్ కార్యదర్శి గుంటూరు నరసింహారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అచ్చంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల కళాశాల, మోడరన్ పెంటాథ్లాన్ ఎంపికలు గోరంట్లలోని నెక్స్‌జెన్ పాఠశాలలో జరుగుతాయని పేర్కొన్నారు. 28న త్రోబాల్ ఎంపికలు బాపట్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల, చిలకలూరిపేటలోని ఏఎంజీ స్కూల్లో బాస్కెట్‌బాల్, బాక్సింగ్ ఎంపికలు ఉంటాయని వివరించారు. 2006 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించిన వారు అర్హులని, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్స్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ సంతకంతో హాజరు కావాలని సూచించారు.

ఏసీఏ మ్యాచ్‌కు వర్షం దెబ్బ

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఏసీఏ ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. శనివారం సెంట్రల్ జోన్, నార్త్ జోన్ మధ్య ప్రారంభమైన మ్యాచ్ తొలిరోజు మూడు ఓవర్లకే పరిమితమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సెంట్రల్ జోన్ బ్యాటింగ్‌కు దిగి మూడు ఓవర్లలో ఆరు పరుగులు చేసింది. ఈ సమయంలో వర్షం రావడంతో అంపైర్లు తొలిరోజు ఆటను నిలిపివేశారు. ఆదివారం రెండవ రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతి రావు పర్యవేక్షించారు.

పొన్నూరులో 40.8 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా పొన్నూరు మండలంలో 40.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా కాకుమాను మండలంలో 3 మి.మీ. పడింది. జిల్లా సగటున 7 మి.మీ.గా నమోదైంది. పెదనందిపాడు మండలంలో 16.8, కొల్లిపర 12.4, మేడికొండూరు 9, వట్టిచెరుకూరు 8.8, దుగ్గిరాల 7.6, ప్రత్తిపాడు 7.2, పెదకాకాని 5.8, ఫిరంగిపురం 5.6, గుంటూరు తూర్పు 4.2, గుంటూరు పశ్చిమలో 4 మి.మీ. వంతున పడింది. సెప్టెంబర్ 21వ తేదీ నాటికి జిల్లా సాధారణ వర్షపాతం 101.7 మి.మీ. కాగా, ఇప్పటి వరకు 235.1 మి.మీ.గా నమోదైంది.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యం

ప్రపంచ బీచ్ క్లీనింగ్ డే పురస్కరించుకుని తీరంలో చెత్తాచెదారం తొలగింపు

నిజాంపట్నం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండర్ శివబాలు తెలిపారు. ప్రపంచ బీచ్ క్లీనింగ్ డే పురస్కరించుకుని కోస్టుగార్డు, మత్స్యశాఖ, ఇన్‌కాయిస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిజాంపట్నం సముద్రతీరాన శనివారం చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండర్ శివబాలు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులను సముద్రపు ఒడ్డున పడవేయడం వల్ల నీటితో పాటు పర్యావరణం కలుషితమవుతోందని తెలిపారు. పరిశుభ్రతతో పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని సూచించారు. సముద్ర తీరంలో చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా నిర్ణీత ప్రాంతంలో వేయాలని సూచించారు. అనంతరం సముద్రపు ఒడ్డున చెత్తా చెదారాన్ని, ప్లాస్టిక్ వస్తువులను ఏరి డంపింగ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో సాయి సందీప్, మెరైన్ ఎస్‌ఐ కె. శ్రీనివాసరావు, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు, మోపిదేవి శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ చంద్రశేఖర్, కోస్టుగార్డు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శిశువు మృతిపై బంధువుల ఆందోళన



మృత శిశువుతో బంధువులు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): పండంటి మగబిడ్డ పుడితే.. మృత శిశువును చేతిలో పెట్టారంటూ ప్రభుత్వాస్పత్రి మాతాశిశు విభాగంలో బంధువులు ఆందోళనకు దిగారు. మృత శిశువు తమ బిడ్డేనా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. దీంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన బి.ఐశ్వర్యకు పురిటినొప్పులు రావడంతో ప్రసవం కోసం శుక్రవారం మధ్యాహ్నం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమెకు రాత్రి ఏడు గంటల సమయంలో సిజేరియన్ చేసి, పుట్టిన మగశిశువును చికిత్స నిమిత్తం స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్‌కు తరలించారు. ఆ సమయంలో తండ్రి మనోహర్‌కూ చూపలేదు. శిశువు ఆరోగ్యంగానే ఉన్నట్లు చెప్పారని ఐశ్వర్య తల్లి, బంధువులు పేర్కొన్నారు. శనివారం ఉదయం కూడా ఇదే తీరుగా వ్యవహరించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో గుండెలో రంధ్రం ఉన్నట్లు చెప్పిన వైద్యులు, పది నిమిషాలకే మృతి చెందినట్లు పేర్కొన్నారు. దీంతో బంధువులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తాడేపల్లిలో ఉన్న వారి సంబంధికులకు తెలియడంతో మరింత మంది ఆస్పత్రికి చేరుకున్నారు. దీంతో సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.వినయ్‌కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ యు.శోభలు ఐశ్వర్య బంధువులను పిలిచి, శిశువు ఆరోగ్య పరిస్థితిని వివరించారు. దీంతో రాత్రి 7.30 గంటల సమయంలో గొడవ సద్దుమణిగింది. శిశువు పుట్టగానే స్క్రీనింగ్ చేసి లోపాలు ఏమైనా ఉన్నాయేమో గుర్తించాల్సి ఉంది. కానీ శుక్రవారం రాత్రి 7.30 గంటలకు జన్మించిన శిశువుకు శనివారం మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఎందుకు స్క్రీనింగ్ చేయలేదనేది ప్రశ్నగా మారింది. పుట్టిన తర్వాత 18 గంటలకు లోపాన్ని గుర్తించడం, శిశువును బంధువులకు చూపించకపోవడమే వివాదానికి దారితీసింది.

గురజాడ సాహిత్యం అజరామరం



సుందరరావుకు పురస్కారం ప్రదానం



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ భార్గవ్ తేజ తదితరులు

నగరంపాలెం: గురజాడ అప్పారావు సాహిత్యం అజరామరం అని, అత్యంత సరళమైన భాషలో సామాన్యుడికి కూడా అర్థమయ్యేలా అనేక రచనలు చేశారని వక్తలు పేర్కొన్నారు. స్నేహ ఆర్ట్స్ (వింజనంపాడు) ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి వేడుక, సాహితీ పురస్కార ప్రదానోత్సవం శనివారం సాయంత్రం జరిగింది. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని పద్మావతి కళ్యాణ వేదికపై ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత నాటకరంగ పరిశోధకులు డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు, రంగస్థల ప్రముఖులు వై.ఎస్.కృష్ణేశ్వరరావు, పాలకమండలి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. రచయిత, దర్శకులు నెమలికంటి వెంకటరమణ అధ్యక్షత వహించారు. అనంతరం తెలుగు నాటక రంగానికి విశేష కృషి చేసిన నాటక రచయిత వాడ్రేవు సుందరరావుకు మహాకవి గురజాడ సాహితీ పురస్కారం ప్రదానం చేసి, సత్కరించారు. స్వర్ణభారతి కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నెమలికంటి వెంకటరమణ రచన, దర్శకత్వం వహించిన 'మీరైతే?' నాటిక ప్రదర్శన సందేశాత్మకంగా సాగింది. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, జి.సాంబశివరావు, షేక్ చిన ఆదాం షఫి, బి.గోపాల్‌రెడ్డి, వెనిగండ్ల మధు, ఆమంచి వెంకట చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అభ్యుదయ కవితా పితామహుడు

గుంటూరు వెస్ట్ : అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ వెంకట అప్పారావు 162వ జయంతిని పురస్కరించుకుని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో పెద్ది రోజా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎం లక్ష్మీకుమారి, ఏఓ పూర్ణచంద్రరావు, సెక్షన్ సూపరింటెండెంట్ ఇస్మాయిల్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆట్యా-పాట్యా చాంపియన్ రోహిత్‌కు అభినందన



నరసరావుపేట: భూటాన్ దేశంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన ఎనిమిదో దక్షిణ ఆసియా ఆట్యా–పాట్యా చాంపియన్‌షిప్ పోటీల్లో మన దేశం తరపున పాల్గొని ప్రథమ స్థానం పొందిన ఉన్నం రోహిత్ జోయల్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అభినందించారు. శనివారం కలెక్టరేట్‌లో తాను సాధించిన కప్‌తో జోయల్ జిల్లా కలెక్టర్‌ను కలిశారు. నరసరావుపేటకు చెందిన రోహిత్ లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న సీనియర్ పీడీ రూన్సీరాణి కుమారుడు కావటం మరో విశేషం. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఆట్యా–పాట్యా అసోసియేషన్ సీఈవో రంభా దుర్గాప్రసాదు, సెక్రటరీ రంభా శ్రీచరణ్, అధ్యక్షులు చావేజ్, కోచ్ పుల్లయ్య అభినందనలు తెలిపారు.